ప్రజాశక్తి
సోమవారం 21 జూలై, 2025
5
శ్రీకాకుళం

23న జాబ్‌డ్రైవ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన ఉదయం తొమ్మిది గంటల నుంచి నగరంలోని అభ్యుదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్ ద్వారా మ్యాన్‌కైండ్ లిమిటెడ్ సంస్థలో 50 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నియామకాలకు బిఎస్‌సి కెమిస్ట్రీలో 70 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన 2023, 2024, 2025 సంవత్సరాల్లో రిలీవ్ అయిన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని రిఫరెన్స్ నంబరు, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 6301045132 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

బూర్జ మండలం పనుకుపర్త వద్ద నాగావళి ఉధృతికి ముంపునకు గురైన పంట పొలాలు (ఫైల్)

కరకట్టల నిర్మాణాల విషయంలో ప్రభుత్వం ఉదాసీనం నదీ తీర గ్రామాల ప్రజలను కష్టాలు పాల్జేస్తోంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో కరకట్టల పనులను రద్దు చేసింది. వాటి స్థానంలో అత్యంత ప్రమాదరకరమైన ప్రాంతాల్లో వరద గట్ల నిర్మించాలని నిర్ణయించింది. ప్రభుత్వ సూచనలతో వంశధార, నాగావళి నదీ తీర ప్రాంతాల్లో తీవ్ర కోతకు గురైన ప్రాంతాలను గుర్తించారు. రక్షణ గోడల నిర్మాణానికి అవసరమైన అంచనా వ్యయంతో ప్రభుత్వానికి 2020లోనే ప్రతిపాదనలు పంపినా అప్పటి వైసిపి ప్రభుత్వంలో అధికారులు ఏదో రకమైన ఒక కొర్రీలు వేసి వెనక్కి పంపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కరకట్టల అంశం ఊసేలేదు. వర్షాకాలం నేపథ్యంలో ఈ ఏడాది నదీ తీర గ్రామాల ప్రజలకు ముప్పు తప్పేలా లేదు.

వరద కష్టాలు పునరావృతమేనా?

- 2019లో కరకట్టల పనులను రద్దు చేసిన గత ప్రభుత్వం
- ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ గోడలనూ నిర్మించని వైనం
- కరకట్టల పనుల జోలికి వెళ్లని కూటమి ప్రభుత్వం
- నదీ పరివాహక గ్రామాలకు ఈ ఏడాది తప్పని ముంపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి నదీ తీర గ్రామాల రక్షణకు గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తాకూస్తో పనులు జరిగినా ఆ తర్వాత నుంచి ఒక్క అడుగు ముందుకు పడటం లేదు.కరకట్టల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూమిని సేకరించాల్సి ఉండటం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం 2019లో ఉన్నపళంగా కరకట్టలను రద్దు చేసింది. వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అధికారులు 2020 ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారు. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. నాగావళి నది పరివాహక ప్రాంతమైన ఆమదాలవలస మండలం తొగరాం వద్ద రూ.13.14 కోట్లతో, గంగ్రేడు వద్ద రూ.8.82 కోట్లతో, బెలమాం వద్ద రూ.1.83 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బూర్జ మండలం అల్లెన నుంచి బూర్జ పాత కరకట్ట వరకు వరద గట్టు కోసం రూ.13.86 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మొత్తం రూ.37.65 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కి.మీ మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపి మూడేళ్ల గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఆమోదం తెలపలేదు.

కరకట్టల పనుల పరిస్థితి ఇలా..

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనులు 2007లో ప్రారంభించారు. ఇప్పటివరకు 7.55 శాతం పనులే పూర్తయ్యాయి. 2007లోనే మొదలైన ప్యాకేజీ-2 పనులు 5.66 శాతం మాత్రమే జరిగాయి. ప్యాకేజీ-3 పనులను కూడా 2007లో ప్రారంభించారు. 2.45 శాతం పనులు పూర్తి చేశారు. 2009లో ప్రారంభమైన ప్యాకేజీ-4 పనులు 21.32 శాతం మాత్రమే జరిగాయి. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టల పరిస్థితీ అలానే ఉంది. శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను నాగావళి-2 ప్యాకేజీ పనులుగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్సు సంస్థకు రూ.61.45 కోట్లకు పనులను అప్పగించారు. 2008లోనే పనులను ప్రారంభించింది. ఇప్పటికీ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కి.మీ మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 17.29 కి.మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ వాటిని మే 29, 2019న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపేశారు

ఎన్నాళ్లీ ముంపు బాధలు?

వర్షాకాలం వస్తే చాలు నదీ తీర గ్రామాలకు ముంపు బాధలు తప్పడం లేదు. ఏటా ఇదే సమస్య పునరావృతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంశధారలో 70 వేల క్యూసెక్కుల వరద ఉధృత ఉంటే కొత్తూరు మండలంలోని పెనుగోటివాడ, మాతల, నివగాం, సోమరాజపురం, ఆకులతంపరలో పొలాలు ముంపునకు గురవుతున్న పరిస్థితి ఏటా సంభవిస్తోంది. నాగవళి నదిలో వరద ప్రవాహ వేగం పెరిగితే నదీ తీర గ్రామాలైన బూర్జ మండలం బూర్జ, వైపర్త, కిళంత్రి, అల్లెన, జి.డి.పురం, కాఖండ్యాం, వావాం, ఉప్పపేట, చినలంకాం, లాభం, నారయణపురం, గుత్తావిల్లి గ్రామాలు, పొలాలు ముంపునకు గురువుతున్నాయి. ఆమదాలవలస మండలం కలివరం, శ్రీకాకుళం మండలం శాంతినగర్ కాలనీ ప్రాంతాల్లోని నాగావళి గట్లు తీవ్రంగా కోతకు గురవుతున్నాయి.

ఇళ్ల స్థలాల పంపిణీకి

లేఅవుట్లు సిద్ధం చేయాలి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్, కోటబొమ్మాళి

పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి అనువైన స్థలాన్ని గుర్తించి లేఅవుట్లను సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. టెక్కలిలోని శ్రీనివాస్ నగర్‌లో రూ.27 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లు, కాలువలకు, ఎన్‌హెచ్ 16 నుంచి అంజనాపురం మీదుగా సవర గోపాలపురం వరకు రూ.198 లక్షలతో నిర్మించనున్న రహదారులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం టెక్కలి మండలం అంజనాపురంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి అవసరమైన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క పేదలకు ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. అంజనాపురంలో అందుబాటులో ఉన్న స్థలాన్ని పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్లస్థలాలు పంపిణీకి అనుగుణంగా లేఅవుట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా టెక్కలి చేరి వీధి సమీపంలో నాలుగు ఎకరాలు సేకరించి లేఅవుట్ల నిర్మాణం ద్వారా అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని ఆదేశించారు. అనంతరం ఆంజనేయపురంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి పట్టుమహాదేవ్ కోనేరును ఏడాదిలోగా అభివృద్ధి చేసి ఆహ్లాదంగా, పర్యాటకంగా కొత్త అనుభూతిని కలిగే విధంగా సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. పట్టణం మధ్యలో పోర్టు వాహనాలు తిరగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో, పాత జాతీయ రహదారి నుంచి మూలపేటకు వెళ్లే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అంతకుముందు టెక్కలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఆల్ ఇన్ కో సంస్థ తయారు చేసిన రూ.73 లక్షల విలువైన 352 ఉపకరణాలను టెక్కలి డివిజన్‌లోని వికలాంగులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వికలాంగ ధ్రువపత్రాలను సమీక్షించి, అర్హులైన వారి జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఎల్.వి.ఎన్ శ్రీధర్‌రాజా, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్, టిడిపి పట్టణాధ్యక్షులు కె.లవకుమార్, దల్లి ప్రసాదరెడ్డి, ముడిదాన ఆనందరావు, కోల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ఇంటింటికీ వివరించాలి

టిడిపి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి వివరించాలని మంత్రి అచ్చెన్నాయుడు టిడిపి నాయకులకు దిశానిర్దేశం చేశారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో సంతబొమ్మాళి మండల నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సుపరిపాలనలో తొలి అడుగు వేశామని, ఇచ్చిన హామీలన్నీ శత శాతం పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం తొలగించిన పింఛన్లనూ త్వరలో అర్హులకు అందిస్తామన్నారు.

వికలాంగులకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నేడు ప్రజా పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం సిటీ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక సోమవారం జిల్లా పరిషత్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని అన్నారు. అర్జీల గురించి వాటి స్థితి, దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెర వెనుక ఎవరు?

- చివరి దశకు చేరుకున్న సత్తారు గోపి హత్య కేసు
- ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టు
- పరోక్ష ప్రమేయం ఉన్న వ్యక్తులపై దర్యాప్తు

ప్రజాశక్తి - శ్రీకాకుళం క్రైమ్

జిల్లాలో సంచలనం రేకెత్తించిన వైసిపి నాయకుడు సత్తారు గోపి హత్య కేసు దాదాపుగా చివరి దశకు చేరుకుంది. ఈ ఘటనలో ప్రత్యక్ష ప్రమేయం ఉన్న ఎనిమిది మందిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. పరోక్ష ప్రమేయం ఉన్న వ్యక్తులపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌పి కె.వి రమణ విలేకరుల సమావేశంలో వెల్లడించడంతో తెర వెనుక ఉన్నదెవరన్న చర్చ సాగుతోంది.

ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన గోపి హత్య కేసును పోలీసులు మూడు బృందాలుగా సమగ్ర దర్యాప్తు చేశారు. ఈ కేసులో ప్రత్యక్ష సంబంధం ఉన్న ఎనిమిది మందిని ఈనెల 18న అరెస్టు చేశారు. వారిని 19న కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. హత్య 11వ తేదీన జరిగింది. పలు కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. హత్యకు గురైన వ్యక్తి బైక్ వెనుక కూర్చున్న ప్రత్యక్ష సాక్షి సత్తారు కోటేశ్వరరావు ఫిర్యాదులో 12 మందిని పేర్కొనగా, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫిర్యాదులో ఉన్న వ్యక్తుల నేర భాగస్వామ్యంపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేశారు. వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఫిర్యాదులో కొన్ని పేర్లు చేర్చినట్లు భావించిన పోలీసులు, ప్రధాన నిందితులను సమగ్రంగా విచారణ చేశారు. ఈ విచారణలో ప్రత్యక్ష దాడిలో ఫిర్యాదులో, ఎఫ్ఐఆర్‌లో లేని మరో ఇద్దరు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎఫ్ఐఆర్‌లో ఉన్న ఆరుగురు, అదనంగా ఇద్దరు నిందితులను చేర్చి మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో పరోక్ష ప్రమేయం ఉన్న వ్యక్తులపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఎఫ్ఐఆర్‌లో ఉన్న మిగతా ఆరుగురిలో ఎవరికి పరోక్ష సంబంధాలు ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అరెస్టు చేసిన నిందితులను సైతం సమగ్రంగా విచారణ చేసిన పోలీసులు ప్రాథమికంగా పరోక్ష సంబంధం ఉన్న వ్యక్తిని గుర్తించారు. ఆరుగురిలో ఐదుగురికి నేరంతో ప్రమేయం లేదన్న నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఒక వ్యక్తికి మాత్రమే సంబంధం ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో ఆధారాల కోసం అన్వేషిస్తున్నారు. ఆధారాల లభ్యత అనంతరం అభియోగ పత్రం కోర్టుకు సమర్పించే అవకాశం ఉంది. ఈ కేసులో పరోక్ష సంబంధం ఉన్న వ్యక్తికి సంబంధించి ఫోన్ కాల్స్ డేటా, ఇతర సాంకేతిక అంశాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

ఫరీదుపేటలో భవిష్యత్‌లో నేర నియంత్రణ చేయాలంటే హత్యతో సంబంధం ఉన్న ప్రతిఒక్కరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే షరామామూలే. ఈ విషయం పోలీసులకూ తెలియంది కాదు. గత వైసిపి ప్రభుత్వంలో పోలీసులు పెట్టిన కొన్ని తప్పుడు కేసుల వల్లే గ్రామంలో ఈ పరిస్థితులు తలెత్తాయన్న విమర్శలు సైతం ఉన్నాయి. అధికార పక్షానికి అనుకూలంగా పోలీసులు వ్యవహరించడం క్రైమ్ రేట్ పెరగడానికి కారణమవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ప్రస్తుతం పోలీస్ పికెట్ కొనసాగుతోంది. సుమారు వంద మంది పోలీసులు రౌండ్ ది క్లాక్ విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు గ్రామంలో మరికొన్ని ఘటనలు జరిగే అవకాశముందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో పోలీసులు తీసుకునే కఠిన చర్యల బట్టే శాంతిభద్రతల పరిస్థితి ఆధారపడి ఉంటుంది.

సంబంధమున్న వారిని విడిచిపెట్టం

హత్య కేసుతో సంబంధం ఉన్న ఎవరినీ విడిచిపెట్టం. ఈ కేసుతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేశాం. పరోక్ష సంబంధం ఉన్న వ్యక్తుల ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నాం. ఆ వ్యక్తులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో నేర నియంత్రణే లక్ష్యంగా దర్యాప్తు సాగుతోంది.

- ఎం.అవతారం,
దర్యాప్తు అధికారి, సిఐ, జె.ఆర్ పురం

పైడిగాం ఛానల్ నీరు విడుదల

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు పైడిగాం ఛానల్ ద్వారా సాగునీటిని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జెఇ సూర్యప్రకాష్, డిఇ సత్యప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుంకిడి పంచాయితీ విక్రాంపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న, అమలు చేయునున్న పథకాల వివరాలతో కూడిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మడ్డు కుమారు, సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మడ్డు కోదండరావు, కిళ్ల రాజేశ్వరరావు, దాసరి దుర్యోధనరావు, మద్దిల చిరంజీవి, సనపల శ్రీరామ్మూర్తి, ఇప్పిలి అప్పలస్వామి, రత్నాల శ్రీనివాసరావు, మడ్డు రవికుమార్, పాండవ శ్రీకాంత్, ఉత్తరాల బ్రహ్మానందం పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న విప్ అశోక్

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం కొనసాగుతుందని మాజీ మంత్రి, వైసిపి డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు సీదిరి అప్పలరాజు అన్నారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమాశం నిర్వహించి మాట్లాడారు. మద్యం కేసులో అక్రమంగా ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో మద్యపాన నియంత్రనికి 33 శాతం షాపులను తగ్గించిందని అన్నారు. 20 డిస్టలరీస్ అన్ని చంద్రబాబు హయాంలో ఇచ్చినవే తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో కొత్తగా ఒక్క డిస్టలరీకీ పర్మిషన్ ఇవ్వలేదని చెప్పారు. చంద్రబాబు నిర్ణయాలుకు భవిష్యత్‌లో ఎన్నో పరిణామాలకు దారితీస్తాయని, అధికారం శాశ్వతం కాదని అన్నారు. లిక్కర్ స్కామ్‌ను రూ.30 వేల కోట్లు దగ్గర మొదలు పెట్టి రూ.2 వేల కోట్లకి తెచ్చారని విమర్శించారు. సిట్ అధికారులు వేధిస్తున్నారని, మాడు సార్లు ఎపిఎస్‌బిసిపిఎల్ వాసుదేవరెడ్డి హైకోర్టుకి వెళ్లారని అన్నారు. లేని స్కామ్‌ను సృష్టించి హంగామా చేస్తున్నారని విమర్శించారు. ఎవరినో సంతృప్తిపరచడానికి అక్రమ అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. నచ్చిన వారికి రూ.వందల కోట్లు విలువ చేసే భూములను కారుచవుకగా కట్టబెట్టేస్తున్నారని విమర్శించారు. విశాఖపట్నంలో రూ.రూపాయికి ఎకరా భూమి ఇవ్వడం స్కీమా, స్కామా అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. చంద్రబాబు పరిపాలనకు పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం మీద నమ్మకం ఉందిని, న్యాయస్థానాల మీద నమ్మకం ఉందని, తప్పుడు కేసులు కోర్టులో నిలవవి అన్నారు. కక్ష సాధింపుల కోసం అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని హితులు పలికారు.

మాట్లాడుతున్న అప్పలరాజు

అచ్చెన్న తీరుపై 'తమ్ముళ్ల' అసంతృప్తి

ప్రజాశక్తి- టెక్కలి

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవహారశైలిపై తెలుగు తమ్ముళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నామినేటెడ్ పదవుల పందేరంలో టెక్కలి నియోజకవర్గం ప్రస్తావనే లేకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కూడా ఇదే నియోజకవర్గానికి చెందిన వారు. టెక్కలి నియోజకవర్గానికి చుట్టు పక్కల ఉన్న నియోజకవర్గాల్లో అక్కడి ఎమ్మెల్యేలు నామినేటెడ్ పదవులు ద్వితీయశ్రేణి నాయకత్వానికి కట్టబెడుతున్నారు. అవి టెక్కలి నియోజకవర్గంలో కానరాకపోవడం గమనార్హం. ఎఎంసి చైర్మన్లు, పిఎసిఎస్, నీటి సంఘాలు ఎటువంటి పదవులను

కట్టబెట్టలేదు. ఇది సరికదా కార్యకర్తలనూ పట్టించుకోవడం లేదనే వాదన బలంగా వినిపిస్తుంది.

నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారు. అందులో భాగస్వామ్యం చేసే క్రమంలో జనసేన నాయకులను దూరంగా పెడుతున్నారనే అసంతృప్తి వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. బాబాయ్, అబ్బాయ్‌లకు ఈ ఎన్నికల్లో విజయం సాధించిపెట్టడంలో కీలకంగా వ్యవహరించిన కార్యకర్తలను పక్కన పెడుతున్నారు. పట్టణంలో వివిధ రకాల అభివృద్ధి పనుల్లో కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం తమ్ముళ్లకు మింగుడు పడడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్నా... ఇప్పటికీ తమ్ముళ్లకు గుర్తింపు లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి అవసరాలకు అనుగుణంగా

సిలబస్‌లో మార్పులు

- ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతా శాతం మెరుగుపై ప్రత్యేక దృష్టి
- ప్రమాణాలతో కూడిన విద్యనందించేలా చర్యలు
- ఆర్ఐఒ ప్రగడ దుర్గారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రస్తుత అవసరాలు, విద్యార్థుల భవిష్యత్‌కు అనుగుణంగా ఇంటర్మీడియట్ విద్యలో మార్పులు చేసినట్లు ఆర్ఐఒ, ఇన్‌ఛార్జి డివిఇఒ ప్రగడ దుర్గారావు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో కనీసం 80 శాతం ఫలితాలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రైవేట్ కళాశాలల కంటే మెరుగ్గా ప్రభుత్వ కళాశాలల్లో విద్యనందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను ఆయన వెల్లడించారు.

? ఇంటర్మీడియట్ విద్యలో ప్రస్తుతం ఎటువంటి మార్పులు జరుగుతున్నాయి?

ఇంటర్మీడియట్ విద్యలో నూతన జాతీయ విద్యా విధానం తర్వాత పలు మార్పులు వచ్చాయి. ఎంపిసి మ్యాథ్స్‌లో రెండు పేపర్లు ఉండేవి. ప్రస్తుతం ఒక్క పేపర్ మాత్రమే ఉంటుంది. బైపిసి స్ట్రీమ్‌లో బోటని, జువాలజీలో రెండు పేపర్లు ఉండేవి ప్రస్తుతం ఒక పేపర్ మాత్రమే ఉంటుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ విధానం అమలవుతుంది.

? సిలబస్‌లో మార్పుల వల్ల ప్రయోజనం ఉందా?

సెంట్రల్ సిలబస్‌కు అనుగుణంగా ఈ మార్పులను ఇంటర్మీడియట్ బోర్డు చేసింది. నీట్, జెఇఇ, ఎపిఇఎపి సెట్ వంటి పరీక్షలకు అవసరమైన పాఠ్యాంశాలు ప్రవేశపెట్టడమైంది. విద్యార్థులు ఉన్నత చదువులకు, భవిష్యత్‌కు, నైపుణ్యాలకు ఈ మార్పులు ఉపయోగపడతాయి.

? జిల్లాలో ఇంటర్ విద్యకు ఎటువంటి ప్రాధాన్యత ఉంది?

పదో తరగతి తర్వాత ఎక్కువ మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య చదువుతున్నారు. జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మొత్తం 98 ప్రభుత్వ యాజమాన్య కళాశాలలు ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలలు 71 ఉన్నాయి. ఇంటర్ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో 20 వేల మంది చదువుతున్నారు. రెండో ఏడాది 19,700 మంది చదువుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మొదటి ఏడాది 40 వేలు, రెండో ఏడాది 40 వేల మంది వరకు చదువుతున్నారు.

? మెరుగైన ఫలితాల కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

గత విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో 65 శాతం, రెండో ఏడాదిలో 76 శాతం ఫలితాలు సాధించాం. ఈ ఏడాది ద్వితీయ సంవత్సర ఫలితాలు 80 శాతం లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నాం.

? ఫలితాల సాధనకు ఎటువంటి ప్రణాళిక అమలు చేస్తున్నారు?

ప్రభుత్వ కళాశాలల్లో అర్హులైన అధ్యాపకులు మెరుగైన విద్యనందిస్తున్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేస్తున్నాం. విద్యార్థులను పూర్తిస్థాయిలో పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. స్లో లెర్నర్స్‌కు కనీసం 50 శాతం మార్కులు వచ్చేలా శిక్షణ ఇస్తున్నాం. వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు క్లాసు వర్క్ నిర్వహిస్తున్నాం. చివరి గంట రెమీడియట్ క్లాసులు, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులు ఆన్‌లైన్ శిక్షణ, స్లో లెర్నర్స్‌పై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం.

? కార్పొరేట్ కళాశాలలు నిబంధనలకు మించి ఫీజుల వసూలు, అదనపు తరగతుల నిర్వహణ వంటి వాటిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ కళాశాలలైనా పనిచేయాలి. విద్యార్థుల నుంచి, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తే సమగ్ర విచారణ చేస్తాం.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జిల్లాలో రౌడీ షీటర్లకు పోలీసు అధికారులు సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలో శ్రీకాకుళం 1, 2వ పట్టణ పోలీస్‌స్టేషన్‌తో పాటు పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో రౌడీషీటర్లు, నేర చరిత్ర, చెడు నడత గలవారిని పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి నేరాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎటువంటి కారణాలు లేకుండా ఘర్షణలు సృష్టించిన ప్రతిఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ప్రమాదకరంగా ఉన్న గోతులు

ప్రమాదకర గోతులతో జరభద్రం

ప్రజాశక్తి - బూర్జ

పాలకొండ, శ్రీకాకుళం ప్రధాన రహదారి బూర్జ మండలంలోని పాలవలస పంచాయతీ పరిధిలో ఉన్న మర్రిపాడు గ్రామం వద్ద గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ముఖ్యంగా వర్షాలు కురుస్తుండడంతో వర్షపునీరు గోతుల్లో చేరి చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు గోతులను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గోతుల వద్ద అను నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలు పాలవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గోతులను గమనించక ద్విచక్ర వాహనాలు, ఆటోలు బోల్తా పడుతున్నాయి. ఇప్పటికే పలువురు తీవ్ర గాయాలు కావడంతో పాటు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కనిపిస్తున్నాయి. అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి రహదారిపై ఉన్న గోతులను కప్పి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

ఎస్‌జిటి నూతన కార్యవర్గం ఎన్నిక

టెక్కలి : ఎస్‌జిటి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. టెక్కలిలోని సంఘ నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌జిటిలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. కేడర్ పోస్టులను ఎస్‌జిటిల ద్వారానే భర్తీ చేయాలన్నారు. వారి స్థానంలోని స్కూల్ అసిస్టెంట్లను వెనక్కి పంపించాలని కోరారు. బకాయి పడిన డిఎలను ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. పిఆర్‌సి ఎరియర్స్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ గౌరవాధ్యక్షునిగా సత్తారు పోలినాయుడు, అధ్యక్షునిగా ఎన్.సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మూల రమణారావు, కారదర్శులుగా బి.వసంతరావు, జి.సరోజిలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కవిటి చంద్రరావు వ్యవహరించారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి నేతాజీ, బి.అనురాధ, ఎన్.భారతి, జోగి జనార్ధనరావు, బి.ఖగేశ్వరరావు, టి.మాధవరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కోటబొమ్మాళి: ప్రకృతి వైద్యాని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యశాల వైద్యులు సిహెచ్. జగదీశ్వ రావు, బి.హెచ్. శ్రీనివాస్, ఎం. దయామనిలు అన్నారు. స్థానిక బోయిన గోవింద రాజులు కళ్యాణ మండపడంలో ఉచిత ఆయుర్వేద సిద్ధ వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా 14 గ్రామాల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవింద రాజులు, చిగురువలస శ్రీనివాస్ తదిరతులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సమ్మె మరింత ఉధృతం

ఇచ్ఛాపురం : మౌనప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు హెచ్చరించారు. నగరంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సమ్మె ఆదివారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు జిఒ 36 ప్రకారం రూ.26 వేలు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక కుటుంబాల పిల్లలకు తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. విశ్రాంత అయిన, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గత సమ్మె కాలపు హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం, ఎ.శంకర్, యుగంధర్, ఎ.శేఖర్, ఎ.రాజశేఖర్, ఎ.జనా, డి.గణేష్, ఎ.లక్ష్మి, ఎస్.పార్వతి, ఆర్.ఈశ్వరమ్మ, ధనలక్ష్మి, పి.మల్లమ్మ, కె.బాలరాజు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని మోణింగి వారి వీధిలో ఉన్న మస్టర్ పాయింట్ వద్ద మున్సిపాల్ కార్మికులు సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు తాడి సంతోష్, ప్రధాన కార్యదర్శి నీలాపు రాజేష్, నాయకులు జె.శ్రీనివాసరావు, కె.తారకేశ్వరరావు, కె.ధనలక్ష్మి, ఎస్.రమ, కె.ఈశ్వరరావు, కె.నీలమ్మ, ఎ.శ్రీనివాస్, డి.రాజేష్ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ పాత బస్టాండ్ వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సి.హెచ్.మురగన్, కె.వెంకట్, ఎం.రవి, ఎస్.శంకర్, ఎ.రమేష్, ఎస్.భాస్కరరావు, కూర్మారావు, బాలకృష్ణ, ప్రకాష్‌ముఖి, గులాబీ, పార్వతి, వాని శకుంతల పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక మస్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మౌనప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రమేష్‌కుమార్ పట్నాయక్, ఢిల్లి, గంగాధర్ రవో, మంగాల సత్య పాల్గొన్నారు. కాగా కార్మికుల సమ్మె నేపథ్యంలో మున్సిపాలిటీలో ముఖ్య కూడళ్లలో చెత్త చెదారం పేరుకుపోయింది. దీంతో దుర్గంధంగా మారింది. చెత్త పేరుకుపోవడంతో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీకాకుళం సిటీ : నిరసన తెలుపుతున్న కార్మికులు

మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

వ్యక్తి మృతి

పలాస : కాశీబుగ్గలో ఆదివారం ఉదయం నడుస్తున్న గుర్తుతెలియని వ్యక్తి (45) ఒక్కసారిగా కుప్పకూలి కింద వడి ఆపస్మారక స్థితికి చేరుకురున్నారు. స్థానికులు గమనించి 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వైద్యుల సమక్షంలో మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యాన్‌ను ఢీకొన్న లారీ

- క్యాబిన్‌లో ఇరుక్కొని లారీడ్రైవర్ మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- 600 కోళ్లు మత్యువాత

మృతి చెందిన లారీ డ్రైవర్

ప్రజాశక్తి - పలాస

మండలంలోని కోసంగిపురం కూడలి వద్ద ఆదివారం ఉదయం ఆగి ఉన్న కోళ్ల వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో లారీడ్రైవర్ మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆరు వందల కోళ్లు మృత్యువాత పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోసంగిపురం కూడలి వద్ద కోళ్ల వ్యాన్ ఆగి ఉంది. ఒడిశా నుంచి విశాఖపట్నం వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్ సుశాంత్ నాయక్ (44) మృతి చెందారు. మరో ముగ్గురికి గాలయ్యాయి. మృతుడు కటక్‌కు చెందిన వాడు. ఈ ప్రమాదంలో కోళ్ల బ్యాన్ పంట పొలాల్లోకి దూరుకుపోయింది. వ్యాన్‌లో ఉన్న ఆరు వందల కోళ్లు మృత్యువాత పడ్డాడయి. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ దీవక్ నాయక్, అసవన్న లోకేష్, అసవన్న దయాకర్లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రిఫర్ చేశారు. కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

పలాస : పలాస రైల్వేస్టేషన్ సమీపంలో జయరామచంద్రపురం వద్ద రైలు నుంచి జారిపడి బరంపురానికి చెందిన అలోక్ అంజన్ తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్ పక్కన అచేతనంగా పడి ఉండడంతో రైల్వే సిబ్బంది 108కి సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడ్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్‌ఐ షరీఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనాలు అందించాలి

లావేరు : మాట్లాడుడుతున్న సిఐటియు నాయకులు రమణ

ప్రజాశక్తి - లావేరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులకు, శానిటేషన్ కార్మికులకు (అయా) లకు కనీసం వేతనాలు ఇవ్వాలని, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ఉత్తర డిమాండ్ చేశారు. మండలంలో మధ్యాహ్న భోజనం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనాల పేరుతో తీవ్రంగా శ్రమదోపిడి చేస్తున్నాయన్నారు. గత 25 ఏళ్లుగా మధ్యాహ్న భోజన వంట కార్మికులకు, గత ఏడేళ్లుగా పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అతితక్కువ గౌరవ వేతనమిస్తూ పని చేయించుకోవడం సరైంది కాదన్నారు. పనికి తగ్గ వేతనాన్ని ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, రాజకీయ తొలగింపు లేకుండా చర్యలు తీసుకోవాలని, కార్మికులకు పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులుగా టి. రామానుజమ్మ, ఎం.కృష్ణవేణి, కమిటీసభ్యులు డి.సరోజిని, డి.లక్ష్మి, టి.పుణ్యావతి, కె.కూమారి, వాణమ్మలను మధ్యాహ్న భోజన పథకం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులకు, పారిశుధ్య కార్మికులకు, ఆయాలకు గౌరవ వేతనం రూ.20 వేలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, మండల కార్యదర్శి టి.సీతమ్మ డిమాండ్ చేశారు. ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో పడాల కుమారి, బలగ జ్యోతమ్మ, బొమ్మాళి రేవతి, కె.రూపావతి, జి.సరస్వతి, పి.గౌతమి, పార్వతి, మీనా పాల్గొన్నారు.

పాతపట్నం : మాట్లాడుతున్న సూరయ్య

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

శ్రీకాకుళం సిటీ: నగరంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎచ్చెర్ల ఎపిఎస్‌బిసిఎల్ ఐఎంఎల్ డిపో హమాళీల సమస్య, యూనిట్ విభజనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సిఐటియు ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. వామ పక్షాలు, కార్మిక యూనియన్ సంఘాలు విజయవంతం చేయాలని కోరారు.

కాలువా? డంపింగ్ యార్డా?

కొత్తూరు: నివాగం రహదారిలో ఉన్న హడ్డుబంగి కాలువ సిరుసువాడ, కుంటిభద్ర, మహర్తాపురాలకు చెందిన వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించేది.

ఇంత ప్రాధాన్యత ఉన్న కాలువలో స్థానిక పళ్ల, కూరగాయలు, హోటళ్లు, టిఫెన్, కొబ్బరికాయల విక్రయించే వ్యాపారులు వాటికి సంబంధించిన వ్యర్థాలు, చెత్తచెదారాలను పడేశారు. దీంతో కాలువ డంపింగ్ యార్డులా తయారైంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో రోగాలు బారిన పడుతున్నారు. ఇటీవల కాలువలో పూడికతీత పనులను చేపట్టినా యథావిధిగానే చెత్తా చెదారాలు వేయడంతో మళ్లీ పేరుకుపోయింది. దీంతో సాగునీరు పూర్తిగా నిలిచిపోయింది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్వాహకులు, అతిథులతో విజేతలు

ఉత్సాహంగా చెస్ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నగరంలోని న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా ఆదివారం ఉత్సాహంగా రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. పాఠశాలల బాలురు, బాలికలు 12 విభాగాల్లో జరిగిన పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 116 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు చెస్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలను రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ జగన్మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గత ఐదేళ్లలో చెస్ చాలా అభివృద్ధి చెందిందని, భవిష్యత్‌లో మరెన్నో టోర్నమెంట్లు నిర్వహణకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ చెస్ ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యులు సనపల భీమారావు, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జామి రమేష్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అడ్వైజర్ కె.వి.వి శర్మ, సిఎస్ఎన్ ట్రస్ట్ సభ్యులు తాండ్ర సునీల్ పాల్గొన్నారు. టిడిపి నాయకులు చౌదరి నారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పాల్గొన్న క్రీడాకారులకు, తల్లిదండ్రులకు సిఎస్ఎన్ ట్రస్ట్ భోజన సదుపాయాలు కల్పించారు. ఈ పోటీలకు చీఫ్ ఆర్బిటార్‌గా ఫణి కుమార్ వ్యవహరించారు. 12 విభాగాల్లో 12 మంది విజేతులుగా నిలిచారు. వీరిని సన్మానించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో శశాంక్ ప్రతిభ

పొందూరు: శ్రీకాకుళంలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పొందూరుకు చెందిన కొమ్మన శశాంక్ తన ప్రతిభను చాటాడు. అండర్-10 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాస్థాయిలో 3వ ర్యాంకును, రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థికి మెడల్, ప్రశంసాపత్రాలను అందజేశారు. శశాంక్ తండ్రి సత్యనారాయణ స్థానిక ఎంఇఒ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తుండగా, తల్లి మానస ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

మెడల్, ప్రశంసాపత్రంతో శశాంక్

కవిటి : మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ఐకమత్యంగా ముందుకు సాగుదాం

ప్రజాశక్తి - కవిటి

నాయకులందరూ ఐకమత్యంగా సాగుతూ కూటమి ప్రభుత్వం మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సూచించారు. స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘ భవనంలో 'బాబు షూరిటీ-మోసం గ్యారంటీ మండలస్థాయి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్‌పి నారాయణ స్వామి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు పులకల శ్రీరాములు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, మండల కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, ఎంపిటిసిలు పూడి నీలాచలం, దుద్ది సతీష్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎంత భయపెట్టినా, ఎన్ని దౌర్జన్యాలు చేసినా వైసిపి కార్యకర్తను, స్థానిక నాయకత్వాన్ని ఏమీ చేయలేరని అన్నారు. కానీ, వారికి మేము ఉన్నాము అన్న భరోసా కావాలన్నారు. ప్రస్తుతం అది కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నియోజకవర్గ నేతల్లో ఉన్న అనైక్యత, సమన్వయ లోపమే తమకి శాపమని వీరంతా కుండ బద్దలుకొట్టారు. ఇప్పటికైనా ఇది సరిదిద్దుకోకపోతే భవిష్యత్ శూన్యమని తేల్చి చెప్పారు. సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసాలపై ఇప్పటికే ఒక తరగతికి చెందిన ప్రజల్లో చర్చ జరుగుతోందన్నారు. విజయ మాట్లాడుతూ అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగినా గత ఎన్నికల్లో 35వేల పైచిలుకు ఓట్లతో పరాజయం తనను కుంగ దీసిందని భావోద్వేగానికి గురయ్యారు. ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని తిరుపతిపాలెం, కమ్మసిగడాంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వైసిపి రణస్థలం మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు ఆదివారం నిర్వహించారు. ముందుగా స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి బాబూ ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, బిసి సెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, దన్నాన హరి, ఉప సర్పంచ్ దన్నాన సీతారం, సింక గౌరి, నాయకులు మండల రవి, మండల సుదర్శిని, ఆకుల గోపి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న తిలక్

టెక్కలి రూరల్: కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించి ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు వైసిపి కార్యకర్త ముందడుగు వేయాలని నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. ఎంపిపి అట్లా సరోజనమ్మ అధ్యక్షతన ఆదివారం మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నాయకులంతా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎండగట్టాలన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల వల్ల మోసపోయి నష్టపోయిన మహిళలు, రైతులు, ప్రజలను చైతన్యపరచాలని కోరారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేస్తున్న అరాచకాలు, వైసిపి కార్యకర్తలపై అణచివేతపై ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, సర్పంచ్ గొండెలి సుజాత, తమ్మన్నగారి కిరణ్, సత్తారు సత్యం, పీత హేమలత, కిల్లి అజయ్‌కుమార్, వాకాడ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రణస్థలం : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

విద్యార్థుల సైకిళ్లకు నగదు పంపిణీ

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని దూసి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో సైకిళ్ల కొనుగోలుకు నిధులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఎమ్మెల్యే కూన రవికుమార్ చేతులమీదుగా జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య ఆధ్వర్యంలో ఒక్కో విద్యార్థికి రూ.5 వేలు చొప్పున నగదును అందించారు. రాష్ట్ర విద్యాశాఖ నిబంధనల మేరకు తోటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను దూసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులు విలీనం చేశారు. తోటాడ, అక్కివరం పంచాయతీలకు చెందిన సుమారు 12 మంది విద్యార్థిని, విద్యార్థులు ప్రతిరోజు దూసి పాఠశాలకు వెళ్లి రావటం జరుగుతున్నది. నడిచి వెళ్లడానికి విద్యార్థిని, విద్యార్థులు ఇబ్బంది పడుతున్న దృశ్యాన్ని చూసిన దూసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఒక్కో విద్యార్థికి రూ.5 వేలు బహుకరించి సైకిల్ కొనుగోలుకు చర్యలు చేపట్టారు. ఉపాధ్యాయులు తమ సొంత నిధులు విద్యార్థుల రవాణా సౌకర్యానికి ఉపయోగించడంపై ఎమ్మెల్యే రవికుమార్‌తో పాటు డిఇఒ, ఎంఇఒ రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయులను, టిడిపి నాయకులు పొన్నాడ గణపతి తదితరులు అభినందించారు.

విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రజావేదిక

- 'ఉపాధి'లో రూ.3.12 కోట్ల అక్రమాలు
- 609 పనుల్లో గుర్తించిన సామాజిక తనిఖీ బృందం
- రూ.6.23 లక్షల రికవరీ, జరిమానా విధింపు

ప్రజాశక్తి - లావేరు

మండలంలోని 33 గ్రామపంచాయతీల్లోని గ్రామాల్లో 2024 -25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పనుల్లో 18వ విడత సామాజిక తనిఖీలు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో చేపట్టిన విషయం తెలిసిందే. ప్రతి పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలకు అవకతవకలు ప్రజావేదికలో కోకొల్లలుగా వెలుగులోకి రావడంతో అధికారులు. ప్రజలు అవాక్కయ్యారు. శనివారం 33 గ్రామ పంచాయతీలు పూర్తి అయ్యేసరికి అర్ధరాత్రి అయ్యింది. డ్వామా పీడీ బి.సుధాకరరావు, అధికారుల బృందం సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పిలు బండారు సూర్యనారాయణ, ఎస్.సూర్యనారాయణ రాత్రి 12 గంటల వరకు ప్రజావేదిక నిర్వహించి పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 609 పనుల్లో భారీగా రూ.3.1237763 కోట్లు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఇందులో రూ.14.47 కోట్లుతో జరిగిన పనులకు ఎపిడి విచారణకు నిర్ణయించారు. రూ.1.65 కోట్లుతో చేపట్టిన పనులను తిరిగి సక్రమంగా చేపట్టి ఫోటోలు పెట్టాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా ఎపిఒ, టిఎలు, జెఇలు, సిఒలు, ఫీల్డ్ అసిస్టెంట్లు నుంచి రూ.2,50,667 లక్షల రికవరీకి, రూ.3,72,500 లక్షలు జరిమానా విధించినట్లు నివేదించారు. లావేరు గ్రామ పంచాయతీలోనే అత్యధికంగా అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. దీంతో రికవరీ రూ.1లక్ష, జరిమానా రూ.70 వేలు విధించారు. ఈ ప్రజావేదికలో డివిఒ లవరాజు, ఎపిడిలు పంచాది రాధా, ఎస్.లోకేష్, జిల్లా ఇన్‌ఛార్జి గౌరి, ఎంపిడిఒ పి.వెంకటరాజు, ఎపిఒ రెడ్డి సత్యవతి, 14 డిఆర్‌పి బృందాలు పాల్గొన్నారు.

శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగిన సామాజిక తనిఖీ

అక్రమ డి-పట్టాను రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని చిట్టివలస పంచాయతీకి చెందిన శీర పోలమ్మ పేరిట మంజూరు చేసిన అక్రమ డి-పట్టాను వెంటనే రద్దు చేయాలని చిట్టివలస సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు, గుజ్జల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొంతమంది యువకులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం మండలంలోని మా సాహెబ్ పేటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే రవికుమార్‌కు చిట్టివలస గ్రామానికి చెందిన యువకులు అక్రమ డీ పట్టాపై వివరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు మాట్లాడుతూ చిట్టివలస గ్రామ పరిధిలో సైలాడ రెవెన్యూ సర్వే నెంబర్ 183 కొండ ప్రాంతంలో ఉన్న భూమిని అర్హత లేని కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు 294, 295-2, 296-1, 296-3 కలిగిన తప్పుడు సర్వే నెంబర్‌లతో గతంలో పట్టాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. శీర పోలమ్మ కుమారుడు సంజీవరావు ఢి పట్టా పేరుతో సుమారు రెండు ఎకరాల భూమిని ఆక్రమణ చేశాడని గ్రామానికి చెందిన యువకులు తెలిపారు. ఈ ఢీపట్టా వ్యవహారంపై ఆదివారం కలెక్టర్‌కు యువకులు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి డీ పట్టాను రద్దు చేయాలని ఎమ్మెల్యేను యువకులు కోరారు. ఎపి యాక్ట్ అమెండమెంట్ - 2023 ప్రకారం అనర్హత కలిగిన వ్యక్తుల అక్రమ డీ పట్టాలు రద్దు చేసి, ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని చిట్టివలస గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రవికుమార్ రెవెన్యూ అధికారులతో మాట్లాడి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతిపత్రం అందించిన వారిలో బంటుపిల్లి కూర్మారావు, బోగి నాగరాజు, నవిరి అర్జునరావు, నవిరి చిన్నారావు, నవిరి శ్రీనివాసరావు, యర్రన్న పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన కొండ ప్రాంతం

సమస్యలపై ప్రిన్సిపాల్ స్పందించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం (జిసిటిఎ) ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజిటెడ్ అధ్యాపకుల సంఘం (జిసిజిటిఎ) ఆమదాలవలస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.ఎస్.ఎస్. స్వామిని అధ్యాపకుల సమస్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. కళాశాలలో అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలపై నెల రోజుల క్రితం విన్నవించినప్పటికీ స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అధ్యాపకులు స్టాఫ్‌రూంలో కూర్చునే పరిస్థితులు లేవని, వృత్తిపరమైన వాతావరణం లోపించిందని, అవాంఛనీయ ధోరణులు నెలకొని ఉన్నాయని, కొందరి అతిథి అధ్యాపకుల ప్రవర్తన వలన తాము ఇబ్బంది పడుతున్నట్లు ఆరోపించారు. ఈ సమస్యలను తెలిపినప్పటికీ స్వామి నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ధోరణులు కళాశాల ప్రతిష్ఠను దిగజార్చటమే కాక అడ్మిషన్లను తగ్గిస్తాయని, కొందరి గెస్ట్ లెక్టరర్ల ప్రయోజనాల కోసం కాకుండా విద్యార్థులు, కళాశాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో చర్యలు తీసుకోకుంటే దశలవారీగా ఆందోళన చేపట్టడంతో పాటు కళాశాల విద్యా డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఒక ప్రకటనలో డా. ఎస్. సాయి కుమార్, డా. పి. రామారావు, ఎల్. కృష్ణారావు, డా. ఆర్.రవిశంకర్, డా.ఎస్. రామకృష్ణ తెలిపారు.

వైసిపి క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అన్వేష్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అన్వేష్

రాష్ట్ర వైసిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఇచ్ఛాపురానికి చెందిన వైసిపి నాయకులు ప్రత్తి అన్వేష్‌గా ఆదివారం అధిష్టానం నియమించింది. వైసిపి బలోపేతానికి కృషి చేస్తున్న అన్వేష్‌ని గుర్తించి పదవి ఇవ్వడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ కురసల కన్నబాబు, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు తమ్మినేని సీతారాం, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కను నాటుతున్న ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

ఇచ్ఛాపురం : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ తిప్పన మోహన్ వెంకటేష్, కాదా రామకోటిలు అన్నారు. పట్టణంలో సురంగి రాజా క్రీడా మైదానంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం మొక్కలను నాటారు. అలాగే కెజిబివి ఆవరణలో ఇంట్రాక్ట్ క్లబ్ మొక్క నాటి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పి.దినేష్, ఎం.నవీన్, జోగారావు, డి. కృష్ణమూర్తిరెడ్డి, కృష్ణారావు, పి.కుమార్ పండా, షణ్ముఖరావు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన సురేష్

ప్రజాశక్తి- లావేరు

అచ్చెన్నాయుడుతో సురేష్

వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును లావేరు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి మండలానికి చెందిన పలు విషయాలు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి సమస్యలు పరిష్కారానికి తనవంతు సహకారాన్ని అందజేస్తానని మంత్రి సురేష్‌కి తెలిపారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన

రణస్థలం: మండలంలోని పైడిభీమవరంలోని ఆటో యూనియన్ నాయకులతో, ఆటోడ్రైవర్లకు జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆదివారం అవగాహన కలిఊంచారు. ఆటోడ్రైవర్లు మహిళా ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ఎటువంటి నేరాలకు పాల్పడకుండా గమ్యస్థానాలకు చేరవేయాలన్నారు. నేరచరిత్ర కలిగిన ఆటోడ్రైవర్ల కదలికలపై ప్రత్యేక బృందాలు పనిచేస్తుంటాయన్నాయని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ మానుకొని ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు అధిగమించి ప్రయాణికులను ఎక్కించరాదని, యూనియన్ డ్రైవర్లు అందరూ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని సూచించారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు ఉంటే తమకు తెలియచేయాలన్నారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ప్రతి వాహనమూ పూర్తి స్థాయి ఇన్స్యూరెన్స్ కలిగి ఉండాలన్నారు. మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యకు దూరమైన వారికి బాసట

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- రణస్థలం

చదువుకోవాలని ఆసక్తి ఉండి అవకాశాలు లేక, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక, రోజువారీ స్కూల్, కాలేజీకి వెళ్లలేక.. ఇలా కారణమేదైనా విద్యకు దూరమైన వారికి బాసటగా నిలుస్తోంది ఓపెన్ స్కూల్. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నామమాత్రపు ఫీజుతో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా (ఎపి ఓపెన్ స్కూల్) దూరవిద్యను గత ప్రభుత్వం పకడ్బందీగా అందించింది. ప్రస్తుతం అవే ఫీజులు, నిబంధనలను కూటమి ప్రభుత్వం అమలుచేస్తోంది. రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానమైన ఈ విద్యను వయసుతో నిమిత్తం లేకుండా ప్రతిఒక్కరూ చదువుకునేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. చదువుకు దూరమైన వారికి ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అండగా నిలుస్తోంది. రెగ్యులర్‌గా పదో తరగతి, ఇంటర్ ఫెయిలైన వారు, వివిధ కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారు, తక్కువ విద్యార్హతతో ఏళ్ల తరబడి చిరుద్యోగం చేస్తున్న వారు, వ్యాపారులు, బాలికలు, గృహిణులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఆయాలు, దిగువ స్థాయి ప్రజాప్రతినిధులు ఇలా ఎవరైనా చేరవచ్చు. గతంలో ఈ దూర విద్యకోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో చదువుకోవచ్చు. రెండేళ్ల ఇంటర్ విద్య అయినా, పదో తరగతైనా ఏడాదిలోనే పూర్తి చేసుకోవచ్చు.

ప్రవేశాలకు వేళాయె

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సమీపంలోని ప్రభుత్వ స్టడీ సెంటర్ దగ్గర వద్ద గాని, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎపిఓపెన్ స్కూల్.ఓఆర్‌జి వెబ్‌పోర్టల్‌లో జూలై 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.200 ఆలస్య అపరాధ రుసుంతో ఆగస్ట్ 15 వరకు చెల్లించేందుకు గడువు ఉంటుంది. ఈ ఏడాది ఆగస్ట్ 31 నాటికి 14 ఏళ్ల వయస్సు నిండిన అభ్యర్థులు పదో తరగతిలో ప్రవేశానికి అర్హులు. 15 ఏళ్ల పూర్తయి పదో తరగతి పాసైనవారు, ఇంటర్ మధ్యలో ఆపేసినవారు, ఫెయిలైనవారు ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానం

ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్‌కి విలువ ఉంటుందో లేదోననే అపోహ చాలా మందిలో ఉంది. అయితే అది పూర్తిగా అవాస్తవమని విద్యాశాఖ ఉన్నతాధికారులే చెబుతున్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ జారీ చేసే ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సాధారణ పాఠశాల విద్య, కళాశాల విద్య సర్టిఫికెట్లతో సమానం. వీటితో ఉన్నత విద్యకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని విద్యాశాఖాధికారులు, యూనివర్సిటీ అధికారులు సైతం స్పష్టం చేస్తున్నారు. ఓపెన్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాస్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు నేరుగా అభ్యర్థుల చిరునామాకే పంపిస్తారు.

బాలికా విద్యకు ప్రోత్సాహం

బాలికా విద్యను ప్రోత్సహించేలా ఓపెన్ స్కూల్ సొసైటీ అనేక చర్యలు తీసుకుంటోంది. ఆర్థిక కారణాలు, సమీపంలో పదోతరగతి, ఇంటర్మీడియెట్ విద్య అందుబాటులో లేక వేలాదిమంది బాలికలు, గృహిణులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. అలాంటి వారు చదువుకునేందుకు ప్రభుత్వం ఫీజులో రాయితీ కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. వీరితో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు, మాజీ సైనికుల పిల్లలకు కూడా ప్రవేశ రుసుం ఫీజులో రాయితీ కల్పిస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. జూలై 30 వరకు గడువు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. అంగన్వాడీలు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఎపి ఓపెన్ స్కూల్ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

శ్రీకాకుళం రూరల్ : వృద్ధులకు పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాకుళం రూరల్ : నగరాలకు దీటుగా గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా ఆదివారం గార మండలం కొర్ని, కొర్లాం, కొమరువానిపేట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ, గ్రామాల్లో చేయాల్సిన పనులను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో ఉండే సమస్యలను, ప్రజా సమస్యలను అడిగి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయో, లేదో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, ఎటువంటి సమస్యనైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా తనకు తెలియజేస్తే, సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలోని మాసాహెబ్ పేటలో టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ప్రజల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు సుజాత, మండల తెలుగు యువత అధ్యక్షులు తమ్మినేని నాని, టిడిపి నాయకులు సనపల ఢిల్లీశ్వరరావు, హనుమంతు బాలకృష్ణ, తాండ్ర హరి, బెండి రామ్మోహన్, కూన అమ్మాజీ, మురళీధర్ యాదవ్, గొండు రమణ, కూన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని బందపల్లిలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, పాతపట్నం ఎఎంసి చైర్మన్ పిన్నింటి చిన్నమ్మి, మాజీ వైస్ ఎంపిపి భైరసింగి దినకర్, సర్పంచ్ రవ్వల గణపతిరావు, టిడిపి మండల యువత అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

సైబర్ నేరాలపై అప్రమత్తం

పొందూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని రామ్మోహన్‌నగర్ కాలనీలో ఆదివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదన్నారు. అలాగే మండలంలోని లోలుగు కూడలిలో వాహనదారులకు రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.

ఎంఇఒ-2గా రామకృష్ణ

పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామకృష్ణ

కవిటి: కవిటి ఎఫ్ఎసి ఎంఇఒ-2గా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎంఇఒ-1 ధనుంజయ మజ్జి, ఎంఆర్‌సి సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

లైన్ షోయింగ్ విధానంలో వరి నాట్లు

వరి లైన్ షోయింగ్ పద్ధతిలో నాట్లు వేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చేపేనపేటలో రైతులచే వరి పంటలో లైన్ షోయింగ్ విధానంలో నాట్లను వేయించారు. ఈ సందర్భంగా సిడిఎఫ్ సురేష్ మాట్లాడుతూ డిపిఎం పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు వరి పంటలో లైన్ షోయింగ్ విధానం లో మూడు ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేయించామని అన్నారు. లైన్ పద్ధతిలో నాట్లు వేయడం వలన పంటలో పురుగులు, తెగుళ్లు రాకుండా ఉంటాయిని, పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పంట మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నక్క చిరంజీవి, సర్పంచ్ చేపేన సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శికి సత్కారం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని మురపాక సర్పంచ్ పెయ్యల నాగమణి భర్త పెయ్యల లక్ష్మణరావు ఇటీవల వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా వైసిపి అధిష్టానం నియామకం చేయడంతో ఆదివారం లక్ష్మణరావుకు రామాలయం వద్ద వైసిపి మండల యూత్ విభాగం అధ్యక్షుడు బాలి శ్రీనువాసనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి కష్టపడి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తేనెల విద్యాసాగర్, వార్డుసభ్యులు వండాన సిమ్మినాయుడు, సింహాచలం,

లక్ష్మణరావును సన్మానిస్తున్న మురపాక గ్రామస్తులు

అసిరినాయుడు, చిన్న బాబు, శ్రీనుబాబు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గురుగుబిల్లి విశ్రాంత విఆర్ఒ, మాజీ గ్రామ మునసబు, వైసిపి జిల్లా కార్యదర్శి బాడిత వెంకటరావు కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. వెంకటరావు ఈనెల 18న అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న కిరణ్ కుమార్ గురుగుబిల్లిలో వెంకటరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మృతికి గల కారణాలను ఆయన కుమారులు దొరబాబు, సాయికుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో గురుగుబిల్లి మాజీ సర్పంచ్ బాడిత రాంబాబు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సత్యనారాయణ, రాము తదితరులున్నారు.

పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం గ్రంథాలయంలో విద్యార్థుల కోసం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వసతి గృహాధికారి కనకరాజు సమక్షంలో 20 మంది విద్యార్థులను ధరావతుదారులుగా చేర్పించారు. ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకొని విజ్ఞానం సంపాదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

శ్రీకాకుళం సిటీ: నగరంలో 1, 2వ పట్టణ పోలీసులు ఆదివారం పోలీసు జాగిలాలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గంజాయి, అక్రమ మద్యం వంటి మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలు, అక్రమ నిల్వలు, రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు పోలీసులు నిర్వహించారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో, అనుమానిత ప్రదేశాలు, కాంప్లెక్స్ పరిసరాల్లో పార్సిల్ సర్వీస్, దుకాణాలు, అదేవిధంగా 1వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో తనిఖీలు చేపట్టి, అనుమానం ప్రదేశాల్లో విస్తృతంగా సోదాలు చేశారు.

కిట్లు అందజేస్తున్న సభ్యులు

కిట్లు అందజేత

టెక్కలి : జూనియర్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన పట్టణంలోని 20 మంది పేద విద్యార్థులకు ఆదివారం కిట్లను అందించారు. కార్యక్రమంలో ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డి.భాస్కర్, సోడిమూడి ప్రవీణ్ పాల్గొన్నారు.